www.samasamajam.in
RNI NO: TELTEL/2016/73311
SAMA SAMAJAM TELUGU DAILY

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : పృధ్విరాజ్. జి 9581442622

బుధ వారం
08-02-2023
సంపుటి - 08,
సంచిక-253
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## 10,11న ఫార్ములా రేస్

హైదరాబాద్‌లో ట్రాఫిక్ జామ్



# ఆదానీ ఆస్తులు పెరగడంలో ప్రధాని పాత్ర

- 2014 నుంచి నేటి వరకు భారీగా పెరిగిన ఆస్తులు
- మోడీతో కలసి ప్రయాణిస్తున్న ఆదానీ
- అనుభవం లేకున్నా ఎయిర్‌పోర్టు పనులు
- పార్లమెంట్ వేదికగా తూర్పారాబట్టిన రాహుల్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 7 (సమ సమాజం):** అదానీ ఆస్తులపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం అదానీ సుమారు 10 రంగాల్లో వ్యాపారం చేస్తున్నారని, మరి 2104 నుంచి 2022 వరకు ఆయన ఆస్తులు 8 బిలియన్ల డాలర్ల నుంచి 140 బిలియన్ల డాలర్లకు ఎలా వెళ్లాయని యువత అడుగుతున్నారని ప్రశ్నించారు. భారత్ జోడో యాత్ర








3వ పేజీలో...

## తప్పులు కప్పిపుచ్చుకునేందుకే విమర్శలు



### ఐటిఐఆర్ విషయంలో అనవసర రాద్ధాంతం

### కెటీఆర్‌తో చర్చకు సిద్ధం అన్న ఎమ్మెల్యే రఘునందన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 7 (సమ సమాజం):** తెలంగాణ ప్రభుత్వం తన వంతుగా చేయాల్సిన పనులను చేయకుండా పదే పదే కేంద్రంపై ఆరోపణలు, విమర్శలు చేయడం పద్ధతి కాదని దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు సూచించారు. ఐటీఐఆర్ పై బహిరంగచర్చకు రావాలంటూ 3లో

## భూకంప ధాటికి విలవిలలాడుతున్న టర్కీ

### టర్కీకి బయలుదేరిన భారత్ సహాయక బృందాలు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (సమ సమాజం):** వరుసగా సంభవించిన మూడు భూకంపాల వల్ల టర్కీ తీవ్రంగా నష్టపోయింది. ఈ క్రమంలో టర్కీని ఆదుకునేందుకు భారత్ ముందుకు వచ్చింది. 3లో

## బడ్జెట్‌ను చూసి నవ్వుకుంటున్నారు!



- ఎక్కడా ప్రజల్లో బడ్జెట్‌పై కానరాని చర్చ
- 1.30 లక్షల ఆదాయం ఉంటే..రూ.2.9 లక్షల కోట్ల బడ్జెట్ ఎలా సాధ్యం?
- బీజేపీ శిక్షణ తరగతుల ప్రారంభించిన బండి సంజయ్

**రంగారెడ్డి, ఫిబ్రవరి 7 (సమ సమాజం):** బడ్జెట్‌ను చూసి జనం నవ్వుకుంటున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ప్రజల్లో బడ్జెట్‌పై చర్చ లేదు. మాటలు తప్ప చేతల్లేవు. కేటాయింపులు ఘనం..ఖర్చులు స్వల్పం. రూ.2.9 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఆదాయం మాత్రం రూ. 1.30 లక్షల కోట్లే చూపడమా? మిగిలిన ఆదాయం ఎక్కడి నుండి వస్తుందో ఎందుకు చెప్పలేదన్నారు. మన్నెగూడలో మంగళవారం వేద కన్వెన్షన్లో బీజేపీ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులకు ముఖ్య అతిథిగా సంజయ్ హాజరయ్యారు. బండితో పాటు... జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఇంద్రసేనారెడ్డి మురళీధర్ రావు మాజీ ఎంపీలు జితేందర్ రెడ్డి, వివేక్, బూర నర్సయ్య 3లో

# వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- పేదలందరికీ ఇళ్లు కట్టిస్తాం
- ఇళ్ళ నిర్మాణానికి ఒక్కొక్కరికి 5 లక్షలు
- రెండోరోజు పాదయాత్రలో రేవంత్ హామీలు

**ములుగు,ఫిబ్రవరి 7 (సమ సమాజం):** జనవరిలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పేదలందరికీ ఇల్లు ఇస్తాం .. ఇళ్ళ నిర్మాణానికి ఒక్కొక్కరికి 5 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో భాగంగా వెంకటాపురం మండలం కేశవాపూర్‌లో వరి, మిర్చి తోటలో పనిచేస్తున్న మహిళా కూలీలు, రైతులను కలిసి వారి సమస్యలు రేవంత్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. పంట గిట్టుబాటు గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే కూలీలతో కలిసి కాసేపు రేవంత్ మిర్చి తెంపారు. రైతు కూలీలు తెచ్చుకున్న సద్ది లోంచి రేవంత్, సీతక్కకు, మల్లు రవిలకు అన్నం ముద్దలు



3వ పేజీలో...

# ప్రొఫెసర్ కాసీం అరెస్టు

### పోలీసుల అదుపులో ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, వామపక్ష ప్రజా సంఘాల నేతలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7 (సమ సమాజం):** విశ్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఓయూలోని ఆర్ట్స్ కాలేజీలో దీక్ష చేస్తున్న ప్రొఫెసర్ కాసీంను పోలీసులు అరెస్టు చేశారు. ఆయనకు మద్దతు తెలిపేందుకు వచ్చిన ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను, వామపక్ష ప్రజా సంఘాల నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రొఫెసర్ కాసీంతో పాటు మంద కృష్ణ మాదిగను పోలీసులు బొల్లారం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ప్రజాసంఘాల నేతలను, ఎమ్మార్పీఎస్ కార్య కర్తలను పోలీసులు మలక్ పేట పోలీస్ స్టేషన్ కు తరలించారు. వారి అరెస్టుల నేపథ్యంలో ఓయూ వద్ద ఉద్రిక్తత నెలకొంది. వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఓయూలో



పాఠాలు చెప్పడానికి ప్రొఫెసర్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతు న్నారని, అందువల్ల విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఆయన దీక్ష చేస్తున్నారు.

# ఉపాధ్యాయుల బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం



ఉమ్మడి జిల్లాల ఆధారంగా బదిలీ ప్రక్రియ ● అధికారులతో సమీక్షించిన మంత్రి సబిత

**హైదరాబాద్, ఫిబ్రవరి 7 (సమ సమాజం):** ఉపాధ్యాయుల బదిలీలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి పూర్వపు జిల్లాను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణ 3వ పేజీలో...

# నగరంలో రోడ్డెక్కిన డబుల్ డెక్కర్లు

### జెండా ఊపి ప్రారంభించిన కెటీఆర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 7 (సమ సమాజం):** హైదరాబాద్ లో డబుల్ డెక్కర్ బస్సులు రోడ్డెక్కాయి. మూడు ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులను మంత్రి కేటీఆర్, సీఎస్ శాంతి కుమారితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, ఎంపీ రంజిత్ రెడ్డి, ఎంఐ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ పాల్గొన్నారు. ఈ నెల 11 నుంచి నె÷-లకెస్ రోడ్, ప్యారడైజ్, నిజాం కాలేజ్ ఏరియాల్లో ఇవి తిరగనున్నాయి.మొత్తం 6 ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సుల కోసం హెచ్ఎండీఏ ఆర్డర్ ఇవ్వగా ప్రస్తుతం 3 బస్సులు అందుబాటులోకి వచ్చాయి. త్వరలో మిగిలిన 3 బస్సులు కూడా అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఈ బస్సులు ఒక్కసారి చార్జ్ చేస్తే 150 కిలో మీటర్ల వరకు వెళ్తుంది.



3వ పేజీలో...

# బిసిల ఆత్మగౌరవాన్ని నిలిపేలా భవనాలు



- బిసిలంతా కెసిఆర్‌కు అండగా నిలవాలి
- దేశంలో ఎక్కడా లేనివిధంగా బిసిలకు అండ
- ఆత్మగౌరవ భవనాలకు శంకుస్థాపనలో మంత్రులు

**రంగారెడ్డి, ఫిబ్రవరి 7 (సమ సమాజం):** ప్రజల గురించి అనునిత్యం ఆలోచించే బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరును గమనించాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. రంగారెడ్డి జిల్లా కోకాపేటలో బీసీల ఆత్మగౌరవ భవనాలకు మంత్రులు గంగుల 3వ పేజీలో...

# వైభవంగా పెద్దగట్టు ఉత్సవాలు

### భక్తుల రాకతో ఆధ్యాత్మికశోభ

**నల్లగొండ, ఫిబ్రవరి 7 (సమ సమాజం):** ప్రముఖ శైవక్షేత్రం పెద్దగట్టు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఏటా ఇక్కడ ఉత్సవాలు అత్యంత వైబవంగా సాగుతాయి. రాష్ట్రంలో రెండో శ్రీశైలంగా ప్రసిద్ధిగాంచిన నార్కట్ పల్లి మండలం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పెద్దగట్టు జాతర ధూంధాంగా సాగుతున్నది. వరుసగా మూడురోజులగా భారీగా జనం తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఒ లింగా.. ఓలింగా నామస్మరణ మార్మోగగా.. భేరీల మోతలు, గజ్జెల లాగుల సవ్వడులతో యాదవుల సంప్రదాయ నృత్యాలు అలరించాయి. గుట్ట చుట్టూ ఎటుచూసినా జన సందడి కనిపించింది. దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి జాతరలో రెండోరోజు సోమవారం తెల్లవారుజామున మ్దదెరపోలు, ముత్యాలపోలు, లగ్గంపోలు కార్యక్రమాలను నిర్వహించారు. బైకాని వంశస్తులు వాయిద్యాల నడుమ గొల్లల చరిత్రను కథల రూపంలో చెబుతుండగా ఆలయహక్కు దారులైన మున్న, మెంతబోయిన, గొర్లవారి సమక్షంలో మ్దదెరపోలు జరిపించారు. మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, తలసాని తదితరులు పూజలు చేశారు. రాష్ట్రంలోని ఏ



3వ పేజీలో...

## సంపాదకీయం

# ఆదానీ వ్యవహారంపై మౌనమేల !!

ఆదానీ వ్యవహారం పార్లమెంటును కుదిపేస్తున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చలించడంలేదు. అతిపెద్ద ఆర్థిక సంక్షోభం దేశంలో జరిగితే తమకు సంబంధం లేదన్నట్లుగా కేంద్రం వ్యవహరిస్తోంది. పార్లమెంట్ వరుసగా నాలుగోరోజూ కూడా వాయిదా పడుతూ వచ్చింది. అయినా ఈ విషయంలో ఓ ప్రకటన అయినా చేయడం లేదు. ఆదానీ వ్యవహారంతో స్టాక్ మార్కెట్ కుదేలయ్యింది. ఎల్ఐసి, ఎస్‌బిఐ పెట్టుబడులపై కేంద్రం నోరుమెదపడం లేదు. దీనికితోడు ఇది స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన వ్యవహారంగా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సరిపుచ్చారు. జెపిసి అంటే జాయింట్ పార్లమెంటరీ కమిటీ విచారణ కు పట్టుబట్టిన విపక్షాలు ఆందోళనచేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఆర్థిక సంక్షోభాన్ని పట్టించుకోకుంటే మరి కేంద్రం ఎందుకన్న ప్రశ్న వేసుకోవాలి. ఏమాత్రం స్వంత ప్రయోజనాలు లేకుంటే మోడీ ఎందుకు మౌనం వహించాలి. ఓ విదేశీ సంస్థ చేసిన ఆరోపణలను ఎందుకు పట్టించుకోవడం లేదు. చేతకాని వాళ్లకు అక్రోశం ఎక్కువ..ఏమీ చేయలేని వారు ఎదుటివారిని నిందిస్తూ ఉంటారు.. వారివల్లనే ఇదంతా జరిగిందని అంటుంటారు. ప్రధాని మోడీ కూడా అదేకోవలోకి వస్తారు...ఎలాంటి స్పందన లేకుండా గంభీరమైన ప్రకటనలు చేస్తూ పోతారు. దేశంలో ఆర్థిక సంక్షోభం కళ్లకు కనిపిస్తుంటే మోడీ తన చేతకాని తనాన్ని బయట పెట్టుకున్నారు. ఆయన అసమర్థ ప్రధాని అని నిరూపించుకున్నారు. దేశంకోసం ఏం చేస్తున్నామో ఆత్మవిమర్శ చేసుకోవాలి. ప్రజలు అన్నమో రామచంద్రా అని చస్తుంటే కనీసం వారిని ఎలా ఆదుకో వాలన్న ఆలోచన లేదు..నిరుద్యోగాన్ని ఎలా తుదముట్టించాలో తెలియడం లేదు. దేశంలో నిరుద్యోగం అనకొండలాగా పెరుగుతున్నా ప్రణాళికలు లేవు. ఆదానీ అంబానీలను పెంచి పోషించి..వారిని ప్రపంచం లో నంబర్‌వన్ పారిశ్రామికవేత్తలుగా ఎలా చేయాలో అన్న ఆలోచన తప్ప సామాన్యుల గురించి ఆలోచన చేశారా అన్నది.. బిజెపి నేతలు..ఆర్ఎస్ఎస్ ముఖ్యులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో అధికారం దక్కించుకోవడమెలా అన్న ఆలోచనలో ప్రజలను విస్మరించి పాలన చేస్తున్న బిజెపి మూల్యం చెల్లించుకోక తప్పదు. ఒక్క మోడీ కారణంగా బిజెపికున్న ఛరిష్మా మొత్తం గంగలో కలిసిపోయింది.ఆదానీ కి శ్రీలంకలో పవర్ ప్రాజెక్టులు కట్టబెట్టేందుకు ప్రధాని మోడీ పైరవీలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. కనీసం దీనిని కూడా ఖండించక పోవడం అనుమానాలకు బలం చేకూర్చింది. ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేయకుండా ఎందుకు అమ్ముతున్నారో జాతికి జవాబు చెప్పడం లేదు. విశాఖ ఉక్కు, ఎల్ఐసి తదితర సంస్థలను ఎందుకు అమ్ముతున్నారో పార్లమెంట్ వేదికగా ఎందుకు చెప్పడం లేదో మోడీని బిజెపి నిలదీయాలి. వాటిని బలోపేతం చేసి మరికొంతమందికి ఎందుకు ఉద్యోగావకాశాలు ఇవ్వలేకపోతున్నారో చెప్పాలి. సాగుచట్టాలతో రైతులను ఏడాదిగా ఎందుకు క్షోభ పెట్టారో చెప్పాలి. నోట్ల రద్దు పర్యవసానాలు, జిఎస్టీ వాయింపులు, పెట్రో ధరల పెంపు, గ్యాస్ ధరల పెంపుపై సమాధానం ఇవ్వాలి. వీటివల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎందుకు గుర్తించడం లేదో... వాటిని సమస్యలుగా ఎందకు పరిగణించడం లేదో చెప్పాలి. పార్లమెంట్ ఉన్నదే ఇలాంటి సమస్యలను చర్చించడానికి. కానీ ..మోడీ అధికారంలోకి వచ్చాక పార్లమెంట్ అన్నది మిథ్యగా మారింది. ఏ అంశం అయినా చర్చకు నోచుకోవడం లేదు. నిజంగానే ప్రధాని మోడీ సర్వసమర్థుడు అయితే పెట్రోధరలను ఎందుకు తగ్గించడం లేదు.గ్యాస్ సిలిండర్ ధరలను ఎందుకు తగ్గించడం లేదు.. పెట్రోల్, డీజిల్ ధరలను ఎందుకు దారికి తేవడం లేదు... ప్రజలకు కావాల్సింది పార్లమెంటులో వీటన్నింటికీ సమాధానమా అన్నది మోడీ గుర్తించాలి. నిజానికి సమర్థ ప్రధాని అయితే విభజన సమస్యలను ఎందుకు పట్టించు కోవడం లేదు. ఎందుకు పరిష్కరించడం లేదు. ఇవన్నీ

పట్టించుకోక పోవడం చేతగానితనంకాక మరోటి కాదు. రూపాయి మారకం విలువ ఎందుకు పెరిగిందో చెప్పాలి. బిజెపి నేతలు కూడా తానా అంటే తందానా అన్నట్లుగా వంతపాడడం తప్ప మరేమీ పట్టనట్లు మాట్లాడడం లేదు. ఇది ఎంతవరకు సమంజసమో ఆత్మవిమర్శ చేసుకోవాలి. మొత్తంగా బిజెపి తీరు.. నానాటికీ తీసికట్టు నాగంభొట్లు ..అన్నట్లుగా తయారయ్యింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అధికారంలోకి రావాలని ఆశ పడుతున్న బిజెపి అసలు ఎజెండా ఏమిటో చెప్పడం లేదు. ప్రజల సమస్యలను పరిష్కరించే తీరులో నిజాయితీ కనిపించడం లేదు. ఆహా ఓహో అంటూ.. భజనలను చేయించుకోవడం తప్ప అధినాయకత్వం సమస్యల విషయంలో సత్వర పరిష్కారం చూపడంలేదు. ఎపిలో అమరావతి రాజధాని ఉద్యమంపై స్పష్టత లేదు. అలాగా తాజాగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను మాత్రం తెగన మ్మడానికి ఉత్సాహం చూపుతోంది. విశాఖ స్టీల్ కోసం ఆందోళన చేస్తున్నా పెద్దగా పట్టించుకోవడం లేదు. తెలంగాణ లో సైతం ప్రజా సమస్యలపై స్పష్టత కానరావడం లేదు. ఎపి విషయానికి వస్తే ప్రధానంగా రాజధాని, పోలవరం, విశాఖ ఉక్కుపై ప్రజలకు ఎలాంటి హామీ ఇస్తారో కూడా చెప్పడం లేదు. కేందప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్రంలో ఆ పార్టీ ఎదుగు దలను అడ్డుకుంటున్నా లెక్కలే కుండా సాగుతున్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలన్న నిర్ణయం విషయంలో కేంద ప్రభుత్వం అడుగులు ముందుకేస్తే బిజెపికి పుట్టగతులండవని గుర్తించుకోవడం లేదు. విశాఖ ఉక్కు విషయంలో కేంద్రం తీరును అడ్డుకోవాల్సిన బాధ్యత స్థానిక బీజేపీ నేతలపైనే ఎక్కువగా ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనపై కాంగ్రెస్ ఎలా వ్యవహరించిందో అన్నది ఇప్పుడు సమస్య కాదు..విభజన తరవాత అధికారం లోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఎంత హుందాగా సమస్యలను పరిష్కరించిందో అన్నది కావాలి. ఎన్ని సమస్యలను పరిష్కరించారో కావాలి.అయితే సమస్యలను పరిష్కరించి..ప్రజలతో శహభాష్ అనిపించు కోవాలి. ఎన్నో దఫాలుగా అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణ.. కేంద్రం దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పరిష్కారం చేయడం లేదు. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చే విషయమై కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుంటిసాకులు చెప్పిందో తెలియంది కాదు. సరైన పద్ధతిలో తెలంగాణ, ఏపీ విభజన జరగలేదంటున్న మోడీ సరైన విధంగా ఎందకు పరిష్కరించడం లేదో చెప్పాలి. వీటన్నింటికి సమాధానం చెప్పకపోవడం.. పరిష్కారానికి ప్రయత్నించక పోవడం అసమర్థుడి లక్షణం తప్ప మరోటి కాదు.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# కత్తిమీద సాములా దళితబంధు

## నియోజకవర్గ స్థాయిలో చాంతాడంత జాబితాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7 (సమ సమాజం):** ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రతి ష్ఠాత్మకంగా చేపట్టింది. తాజాగా దళితబంధు కోసం రూ. 17,700 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. నియోజకవర్గానికి కొందరు నిరుపేద దళితులను ఎంపిక చేసి పథకం కింద ఆర్థిక సాయం అందిస్తారు. అయితే ఇక్కడే చిక్కు వచ్చిపడింది. ఇప్పుడు దళితులంతా ఈ పథకం కింద తమకు సాయం కావాలని కోరుతున్నారు. అణగారిన దళితజాతి సమగ్ర అభ్యుదయం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి దళితబంధు ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది. దళితబంధు సాయం వారి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా.. ఆ సంపద సామాజిక పెట్టుబడిగా మారి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడటానికి తోడ్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దళితులు ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో ప్రభుత్వ లైసెన్సుల ద్వారా చేసుకునే లాభదాయక వ్యాపారాల్లో రిజర్వేషన్లను అమలు చేస్తున్నదని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఒక్కో దళిత కుటుంబానికి రూ.10 లక్షలను అందజేసి, ప్రభుత్వం సూచించిన 35రకాల యూనిట్లలో ఏది ఉపయోగ పడుతుందో దానిని ఎంచుకోవాలని అధికారులు నిర్ధేశిస్తున్నారు. మొదటగా హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. పథకాన్ని మరింత విస్తరించాలనే లక్ష్యంతో ఒక్కోఅసెంబ్లీ నియోజకవర్గంలో వంద మందికి ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో జిల్లాలో అమలునకు కసరత్తులు మొదలయ్యాయి. దళిత కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన దళితబంధు పథకం ఎందరికి వస్తుందో రాదో అన్న బెంగ పట్టుకుంది. నియోజకవర్గానికి కేవలం వంద మందికి మాత్రామే.. అదికూడా ఎంపికచేసిన నియోజక వర్గాలకే అన్ని మెలిక పెట్టారు. దీంతో తమకు రాదా అన్నచర్చ ఇప్పుడు జిల్లాల్లో సాగుతోంది.


ఇప్పటికే ఎంపిక చేసిన జిల్లాల్లో తొలిదశ జాబితాను ఎమ్మెల్యేలు అధికారుల ద్వారా కలెక్టర్‌కు అందజేశారు. నియోజకవర్గానికి 100 మంది చొప్పున దళితబంధు పథకం కింద అర్హులను ఎంపిక




చేయనున్నారు.
ఎంపిక చేసిన వారికి రూ.10లక్షలను అందజేయనున్నారు. అర్హుల జాబితాను సిద్ధం చేయడానికి ఎమ్మెల్యేలు, అధికారులు తలమునకలు అవుతున్నారు. ఆయా మండలాలు, గ్రామాలలో లబ్దిదారులను ఎంపిక చేస్తున్నారు. ఎమ్మెల్యేలు అర్హుల జాబితాను రూపొందించి అధికారులకు పేర్లను అప్పగించాలని సూచించింది. కొన్ని నియోజకవర్గాల్లో దళిత కుటుంబాలు అధిక సంఖ్యలోనే ఉండడం పథకం తొలిదశగా నియోజకవర్గాల్లో కేవలం 100 మందికి మాత్రమే అవకాశం కల్పిస్తుండడంతో ఎంపిక ఎమ్మెల్యేలకు కత్తిమీద సాములా మారింది. దీంతో ఎమ్మెల్యేలు ఆచితూచి ఎంపిక చేసే పనిలో ఉన్నారు. జిల్లాల్లో ఇప్పటికే తొలివిడత జాబితాను ఆయా ఎమ్మెల్యేలు అధికారులకు సమర్పించినట్లు సమాచారం. ఈ జాబితాను కలెక్టర్ ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలించనున్నారు. అనంతరం ఎంపిక చేసిన వారి వివరాలను క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలిస్తారు. ఎంపిక చేసిన లబ్దిదారుల జాబితా కలెక్టర్ కార్యాలయ అధికారులకు ఆయా మండలాల అధికారులు అందించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో లబ్దిదారుల దగ్గరకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే ఒక్కో నియోజకవర్గానికి జిల్లాస్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించి పర్యవేక్షిస్తున్నారు. మండల స్థాయిలో ప్రత్యేకాధికారి, ఎంపీడీవో, తహసీల్దార్ సంబంధించిన అధి కారులు క్షేత్రస్థాయిలో లబ్దిదారులను ధృవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. దింతో లబ్దిదారుల నుంచి వివరాలు సేకరించి అధికారులు నమునాలు నమోదు చేస్తున్నారు. లబ్దిదారుల బ్యాంకు ఖాతాలు తెరవడంపై దృష్టి సారించారు. దీనికి సంబంధించి ప్రతీ నియోజకవర్గానికి ఒక్కో బ్యాంకును ప్రభుత్వం కేటాయించింది. ఖాతాలు ప్రారంభించడానికి అవసరమైన చర్యలు అధికారులు తీసుకుంటున్నారు. ఖాతాల పక్రియ పూర్తయిన తదుపరి యూనిట్లపై అవగాహన కల్పించను న్నారు. నియోజకవర్గ కేంద్రంలో అవగాహన నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. అందుకు ఒకే రకమైన యూనిట్లు ఎంచుకుంటే ఇబ్బందులు ఎదుర వుతాయని ఒక్కొక్కరు ఒక్కోరకమైన యూనిట్‌కు తీసుకో వాలని అధికారులు సూచిస్తున్నారు. మొత్తంగా ఈ వ్యయహారం సాఫీగా సాగుతుందా..తమకు రాలేదన్న వారు ఎలాంటి ప్రతిఘటనచేస్తారో అన్నది ఎమ్మెల్యేల్లో భయంగాఉంది.

# దక్షిణ పెరూలో వర్షబీభత్సం

## కొండచరియలు విరిగిపడి 15మంది మృత్యువాత



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (సమ సమాజం):** దక్షిణపెరూలోని అరేక్విపా ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి కనీసం 15 మంది మృతి చెందినట్టు పేరూలోని జాతీయ అత్యవసర సేవ విభాగం వెల్లడించింది. భారీ వర్షాల కారణంగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని తెలియజేసింది. ఈ ఘటనలో గాయపడ్డ 20 మందిని ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరు గల్లంతయినట్లు అధికారులు తెలిపారు. వీరిని రక్షించే ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు. వర్షా బాధితులను ఆదుకునేందుకు హెలికాప్టర్లు, టెంట్లు, నీటి ట్యాంకులు, ఇసుక సంచులు, విపత్తు సహాయక సిబ్బంది ద్వారా అందిస్తున్నామని ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ ట్విట్టర్‌లో తెలిపింది. కమనా ప్రావిన్స్‌లోని సెకోచా పట్టణానికి సమీపంలో కొండచరియలు విరిగిపడటంతో మరో ఐదుగురు గల్లంతయినట్లు అధికారులు తెలిపారు.దక్షిణపెరూలో జరిగిన ఘటనపై అరేక్విపా గవర్నర్ రోహెల్ సాంచెజ్ స్పందిస్తూ దక్షిణ పెరూలోని నాలుగు పట్టణాల్లో వర్షాల కారణంగా పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొన్నారు. అరేక్విపా అంతటా దాదాపు 12వేల మంది వర్షాప్రభావానికి లోనయ్యారని వివరించారు.

# కేంద్ర బడ్జెట్ తయారీ విధానం మారాలి

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 7 (సమ సమాజం):** కేంద్ర బడ్జెట్ తయారీ విధానం మారాలని, లేకపోతే ఎన్నేళ్లయినా అసమానతలు కొనసాగుతూనే ఉంటాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశం పేదలు, సంపన్నుల భారత్‌గా విడిపోయిందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు డీ పాపారావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1920–30లో ఒకశాతం ప్రజల చేతుల్లో 20శాతం సంపద ఉండేదన్నారు. 1990 నుంచి ప్రపంచీకరణ నేపథ్యంలో అసమానతలు ప్రారంభమై ఒక శాతం చేతిలో 40 శాతం, 10 శాతం చేతిలో 80 శాతం సంపద పెరిగిపోయిందన్నారు. ఉత్పాదక, మౌలిక రంగాలపై ఆధారపడాల్సిన ఆర్థిక వ్యవస్థ కేవలం స్టాక్స్, షేర్స్‌పై ఆధారపడి స్పెక్యులేషన్‌తో కృత్రిమ సంపదగా, జూదంలా తయారైందన్నారు. ఆదానీ కేవలం స్టాక్ మార్కెట్ ద్వారా తన ఆదాయాన్ని పెంచుకున్నారని, దానిలో జరిగిన కుంభకోణంతో ఒకేసారి తన ఆర్థిక సామ్రాజ్యం కూలిపోయిందని కూనంనేని పేర్కొన్నారు. దాంతో దేశ ఆర్థిక వ్యవస్థ మీద కూడా ఆ ప్రభావం పడిందన్నారు. స్టాక్ మార్కెట్‌లో జిలుగుబిలుగు మెరుపులతో దేశ సంపద తగ్గిందని అంచనా వేయడం సరికాదన్నారు. పేదవారికి మరిన్ని సంక్షేమ ఫలాలు అందాలంటే వ్యక్తి కేంద్రంగా బ్జడెట్ తయారి లక్ష్యంగా ఉండాలన్నారు. ప్రస్తుత బడ్జెట్ రూపకల్పన అసమానతలు పెంచేవిధంగా ఉందని, అందుకు వ్యక్తికేంద్రీకరణగా జీరో బ్జడెట్‌ను రూపకల్పన చేయాలని కూనంనేని డిమాండ్ చేశారు. ఆర్థిక విశ్లేషకులు పాపారావు ద్రవ్యోల్బణం, ఆర్థిక వ్యవస్థ, బడ్జెట్‌పై విశ్లేషణ చేశారు. షేర్‌మార్కెట్‌లు దేశ ఆర్థిక వ్యవస్థ మీదున్న ప్రభావాన్ని వివరించారు. అదానీని తక్షణం అరెస్ట్ చేయాలని, లక్షల కోట్ల కుంభకోణానికి పాల్పడి, ప్రభుత్వరంగ సంస్థలైన ఎల్ఐసీ, ఎస్‌బీఐ లాంటి సంస్థలకు తీవ్ర నష్టానికి కారణమైన అదానీని తక్షణం అరెస్టు చేయాలన్నారు. మొత్తం వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని కూనంనేని డిమాండ్ చేశారు.

# ఏడుగురు ఐపీఎస్ అధికారులు బదిలీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 7 (సమ సమాజం):** రాష్ట్రంలో ఏడుగురు ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. వెయిటింగ్ లో అధికారులకు పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీఐడీ ఎస్పీగా ఆర్ వెంకటేశ్వర్లు, సైబరాబాద్ పరిపాలన డీసీపీగా యోగేశ్ గౌతమ్, పీసీఎస్ ఎస్పీగా రంగారెడ్డి, జీఆర్పీ అడ్మిన్ డీసీపీగా రాఘువేందర్‌రెడ్డి, వరంగల్ పోలీస్ శిక్షణా కేంద్రం ఎస్పీగా పూజ, డీజీపీ కార్యాలయం న్యాయవిభాగం ఎస్పీగా సతీశ్, వరంగల్ నేర విభాగం డీసీపీగా మురళీధర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత జనవరిలోనూ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఐపీఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. జనవరి 25న రాష్ట్రవ్యాప్తంగా 91 మంది అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది.

# బిఆర్ఎస్ నేత బెదిరింపులు

## తట్టుకోలేక మహిళా ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

**ఖమ్మం, ఫిబ్రవరి 7 (సమ సమాజం):** ఖమ్మం దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో కలకలం రేగింది. కార్యాయలంలో విధులు నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ ఇన్స్ పెక్టర్ సమత ఆత్మహత్యాయత్నం చేశారు. ఖమ్మం రూరల్ మండలం బీఆర్ఎస్ అధ్యక్షుడు, రూరల్ ఎంపీపీ భర్త, పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి ప్రధాన అనుచరుడు బెల్లం వేణు తనను ఇష్టం వచ్చినట్లు దూషించాడని మనస్తాపానికి గురై.. తన కార్యాలయంలోనే నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. వెంటనే సహచర ఉద్యోగులు సమతను ఖమ్మం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మారెమ్మ గుడి కమిటీ విషయం గురించి దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సమతకు ఖమ్మం రూరల్ మండలం బీఆర్ఎస్ అధ్యక్షుడు బెల్లం వేణు ఫోన్ చేశాడు. మారెమ్మ గుడి కమిటీ గురించి దేవాదాయశాఖ నోటీస్ బోర్డు, మండల ఆఫీసు,పేపర్ లోప్రకటన ఇచ్చామని సమత వివరణ ఇచ్చారు. ట్రస్ట్ బోర్డు నోటిఫికేషన్ వచ్చి కూడా 2, 3 నెలల సమయం అయ్యిందని చెప్పారు. అయితే.. తమకు ఎందుకు చెప్పలేదని, సీక్రెట్ గా నోటీసు వేస్తే ఎలా అని బెల్లం వేణు ప్రశ్నించారు. తమకు కూడా చెప్పాలి కదా..? అని ఫోన్ లో నిలదీశారు. సిక్రెట్ గా నోటీసు అంటించలేదని, ఓపెన్ గానే అందరికీ తెలిసేలా అంటించామని సమత చెబుతుండగా.. బెల్లం వేణు ఆగ్రహంతో ఊగిపోయాడు. తనపై విసుక్కోవడం సరైన పద్ధతి కాదని సమత సూచించారు.

# పాదయాత్రలతో రాజకీయ సందడి



పోటాపోటీగా నేతల పాదయాత్రలు
షర్మిల, లోకేశ్, రేవంత్‌ల పాదయాత్రలు
కార్నర్ మీటింగ్‌లకు సిద్ధం అవుతున్న బిజెపి

**హైదరాబాద్/అమరావతి, ఫిబ్రవరి 7 (సమ సమాజం):** గతంలో పాదయాత్రలు సక్సె కావడంతో పాటు, మంచి ఫలితాలు ఇవ్వడంతో ఇప్పుడు నేతలంతా ప్రజలను నేరుగా కలుసుకునేందుకు పాదయాత్రలనే ఎంచుకుంటున్నారు. దివంగత వైఎస్ పాదయాత్ర అప్పట్లో ట్రెండ్ సెట్టర్ అయ్యింది. తరవాత చంద్రబాబు కూడా పాదయాత్రచేపట్టారు. జగన్ కూడా పాదయాత్రతో అధికారంలోకి వచ్చారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్, చంద్రబాబులు అధికారం దక్కించుకున్నారు. అదే క్రమంలో ఇప్పుడు నేతలంతా పాదయాత్రలను తమ రాజకీయ లక్ష్యంగా చేపట్టారు. తాజాగా తెలంగాణ పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మేడరాం నుంచి పాదయత్ర చేపట్టారు. వచ్చే ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా ఆ పాదయాత్ర చేపట్టారు. ఈ క్రమంలో తెలుగు రాష్టాల్లో రాజకీయ నేతల పాదయాత్రలు జోరుగా కొనసాగుతున్నాయి. తెలంగాణలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి 'హాత్ సే హాత్ జోడో యాత్ర'.. వైఎస్ఆర్టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రజా సంగ్రామ యాత్ర, ఏపీలోని చిత్తూరు జిల్లాలో టీడీపీ నేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర కొనసాగుతోంది. టీడీపీ నేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఏపీలోని చిత్తూరు జిల్లాలో జోరుగా కొనసాగుతోంది.





యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ముందుకుసాగుతున్నారు. చిత్తూరు జిల్లాలో కొనసాగుతున్న నారా లోకేష్ యువ గళం పాదయాత్రకు కూడా ప్రజదాదరణ వస్తోంది. మంగళవారం 12వ రోజు చిత్తూరులో లోకేష్ పాదయాత్ర కొనసాగుతోంది. ఉదయం 8 నుంచి కొంగారెడ్డిపల్లిలోని టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయం వద్ద పార్టీ కార్యకర్తలు నేతలతో లోకేష్ సమావేశమయ్యారు. ఇక వైఎస్ షర్మిల తెలంగాణలో పాగా వేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. తన తండ్రి వైఎస్ లెగసీని అడ్డంపెట్టుకుని ఆమె పాదయాత్రకు దిగారు. వరంగల్ జిల్లాలో నర్సంపేట ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలతో దాడి జరిగింది. దీంతో పాదయాత్రకు బ్రేక పడింది. రెండ్రోజుల క్రితమే షరతులతో మళ్లీ ఆమె యాత్రకు దిగారు. ములుగు నియోజకవర్గంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హాత్ సే హాత్ జోడో యాత్ర సోమవారం ప్రారంభం అయ్యింది. వైఎస్ షర్మిల ప్రజా సంగ్రామ యాత్ర ధర్మసాగర్ మండలంలో కొనసాగుతోంది. ఉదయం నుంచి షర్మిల పాదయాత్ర చేస్తున్నారు. మంగళవారం రామప్ప ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహించిన అనంతరం రెండోరోజు పాదయాత్రను రేవంత్ రెడ్డి చేపట్టారు. పాలంపేట, కేశవాపూర్ బండారుపల్లి మీదుగా ములుగు జిల్లా కేంద్రం వరకు పాదయాత్ర కొనసాగనుంది. సాయంత్రం 6గంటలకు ములుగులో కార్నర్ మీటింగ్ జరగనుంది. ఇకపోతే బిజెపి నేతలు కూడా కార్రన్ మీటింగ్‌ల్తో ప్రజల వద్దకు వెళ్లబోతున్నారు. ఒక్కో నియోజకవర్గంలో కనీసం వందకు తగ్గకుండా మీటింగ్‌లు పెట్టాలని చూస్తున్నారు. మొత్తంగా యాత్రలతో ఇప్పుడు తెలంగాణ, ఎపిల్లో రాజకీయ సందడి మొదలయ్యింది.

# పాతసీసాలో కొత్త సారా పోసినట్టుగా బడ్జెట్

గతేడాది బడ్జెట కాపీనే కొత్తగా దించేశారు

కేటాయింపులకు..ఖర్చులకు పొంతన లేదు

పలు ప్రాజెక్టులను పూర్తి చేయకుండా విస్మరించారు

మండిపడ్డ వైఎస్ షర్మిల



**వరంగల్, ఫిబ్రవరి 7 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ కొత్త సీసాలో పాత సార పోసినట్లు ఉందని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల ఎద్దేవ చేశారు. ప్రజాప్రస్థానం పాదయాత్రలో మంగళవారం షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి హరీష్ రావు కొత్త సంవత్సరం కదా అని కొత్త సీసా తీసుకొని ఫామ్ హౌజ్‌కి వెళ్ళారు. అందులో ఆయన మామ పాత సార పోశారు. గతేడాది బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులు మీద సమాధానం చెప్పాలి. గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు రూ.12వేల కోట్లు కేటాయించారు. ఈసారి దళిత బంధుకు రూ. 17 వేల కోట్లు పెట్టారు. అసలు కేటాయింపులకు, ఖర్చులకు పొంతనే లేదు. గతేడాది బడ్జెట్‌ను కాపీ పేస్ట్ చేశారు. ఈ ఏడాది కేటాయింపులకు న్యాయం చేస్తారని గ్యారెంటీ ఉందా..? పథకాలకు బడ్జెట్ కేటాయించి ఖర్చు పెట్టక పోతే ఎందుకు..?బడ్జెట్‌ను వేస్ట్ పేపర్ చేస్తున్నారు. చెత్తబుట్టలో పడేసెలా చేస్తున్నారు. 8 ఏళ్లుగా ముఖ్యమంత్రి ఇచ్చిన ఒక్క హామీ నిలబెట్టుకోలేదు. సీఎం అన్నాక ఇచ్చిన మాటకు విలువ ఉండదా..? సీఎం మాటలు మాత్రం కోటలు దాటుతాయి.. చేతలు మాత్రం గడప దాటడం లేదని తీవ్రస్థాయిలో షర్మిల మండిపడ్డారు. అందుకే గతేడాది బడ్జెట్‌ను కాపీ పేస్ట్ చేసినట్లు ఈసారి పద్దులు ఉన్నాయని విమర్శించారు. కేటాయింపులకు, ఖర్చు చేస్తున్న నిధులకు అసలు పొంతనే లేదని షర్మిల వాపోయారు. కెసిఆర్ ఎనిమిదిన్నరేళ్లలో ప్రజలకిచ్చిన ఒక్క హామీని నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. దేవాదుల, కంతనపల్లి, డిండి, ఎస్ఎల్బీసీ, సీతారామ, నక్కల గండి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. గుదిబండలా మారిన కాళేశ్వరం ప్రాజెక్టు కోసం లక్షా 20వేల కోట్లు ఖర్చు చేస్తే అది మూడేళ్లకే మునిగిపోయిందని షర్మిల విమర్శించారు. ఆ ప్రాజెక్టు వ్యయంలో ఒక వంతు ఖర్చు చేసినా 33 ప్రాజెక్టులు పూర్తయ్యేవని అన్నారు. రుణమాఫీ కోసం 36 లక్షల మంది రైతులు ఎదురు చూస్తుంటే బడ్జెట్‌లో కేవలం రూ.6 వేల కోట్లు మాత్రమే కేటాయించడాన్ని షర్మిల తప్పుబట్టారు. రైతు బంధు పేరుతో రూ.10 వేలు ఇచ్చి రైతులకిచ్చే సబ్సిడీలన్నీ బందు పెట్టారని మండిపడ్డారు. రైతులను రాజును చేశామంటున్న కేసీఆర్ రాష్ట్రంలో అన్నదాతలు ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.4.80లక్షల కోట్ల రుణాలతో రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన సీఎం కేసీఆర్.. ఒక్కొక్కరి నెత్తిన 1.20లక్షల అప్పు పెట్టిందని మండిపడ్డారు.

# వివాహవయస్సు 21ఏళ్లు ఉండాల్సిందే

## అప్పుడే వారి ఆరోగ్యానికి రక్షణ: కాశీనాథ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 7 (సమ సమాజం):** అమ్మాయిలకు కనీస వివాహ వయసు 18 కాకుండా 21 ఏళ్లు ఉండాలని కేంద్రం చేసిన ప్రతిపాదనలు చట్టరూపంలోకి తీసుకుని రావాలని బాలల హక్కుల సంఘం, స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు డిమాండు చేస్తున్నారు. దీనిపై విపక్షాలు మోకాలడ్డడం సరికాదన్నారు. ఇది వయసుకు సంబంధించిదే తప్ప మతానికి ముడిపెట్టరాదన్నారు. పెళ్లీడుకు ముందు జరుగుతున్న వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం దెబ్బతింటోందని ప్రముఖ బాలల హక్కుల పోరాట నేత కాశీనాథ్ అన్నారు. బాలలహక్కుల సంఘం స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, న్యాయనిపుణులు, సామాజికవేత్తలు, సైకియాట్రిస్టులు, గైనకాలజిస్టుల గతంలో అనేకమార్లు ఈ ప్రకటన చేశారు. ఈ ప్రతిపాదనను మహిళా సంఘాలు స్వాగతిస్తున్నాయి. కేంద్రం ఇటీవల వివాహ వయస్సును 21 ఏళ్లకు పెంచాలని నిర్ణయించినా సెలెక్ట్ కమిటీకి పంపారు. దీనిని చట్టం చేయడంతో పాటు ప్రచారం చేయాలని ఆయన అన్నారు. అప్పుడే మహిళలకు రక్షణ కూడా ఉంటుందని అన్నారు. యువతులకు 18 ఏళ్ల వయసులో భావోద్వేగ పరిపక్వత ఉండదని చెప్పారు. వివాహాలు విజయవంతం కావాలంటే పెళ్లికూతురి వయసు 21 ఏళ్లు ఉండాలన్నారు. అమ్మాయిలు ఆర్థిక స్వాతంత్య్రం సాధించాలంటే వారు ఉన్నతవిద్య అభ్యసించాలని సూచించారు. అమ్మాయిల వివాహ వయసు తక్కువ ఉంటే వారు గర్భం దాల్చినపుడు తల్లీ పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని గౌనకాలజిస్టులు చెప్పారు. గర్భం దాల్చేందుకు మహిళలకు 21 నుంచి 25 ఏళ్లు సరైన వయసు అని డాక్టర్లు సూచించారు. తక్కువ వయసులో అమ్మాయిలకు పెళ్లి చేస్తే పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆరోగ్యానికి కూడా క్షేమం కాదన్నారు.

# ఉపాధ్యాయుల బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం



(మొదటి పేజీ తరువాయి) యించింది. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ ఉత్తర్వులు 317లో వేరే జిల్లాకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు పూర్వ జిల్లా సర్వీసును పరిగణనలోకి తీసుకుని ఉపాధ్యాయ బదిలీలకు దరఖాస్తు చేసుకోవడానికి సీఎం కేసీఆర్ సూచనల మేరకు అవకాశం ఇవ్వనున్నట్లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో మంగళవారం తన కార్యాలయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే ప్రారంభమైన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుందని జీవో 317 కింద బదిలీ అయిన ఉపాధ్యాయులు తాజాగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 12 ఉంచి 14వ తేదీ వరకు అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులందరికీ సమన్యాయం చేకూర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే వచ్చిన 59 వేల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయబడుతందని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు.

# బడ్జెట్‌ను చూసి నవ్వుకుంటున్నరు !

(మొదటి పేజీ తరువాయి) గౌడ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. లిక్కర్, భూములు అమ్మకోవడం, పన్నులు, ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపడం ద్వారా ఆదాయం పెంచుకోవాలనుకుంటున్నారు. కేంద్రాన్ని తిట్టడానికి మాత్రమే బడ్జెట్ ప్రవేశపెట్టినట్లుంది. దేశంలో బడ్జెట్‌ను పూర్తి వివరాలతో ప్రవేశపెట్టారు. లిక్కర్ ఆదాయం రూ.40 వేల కోట్లుంటే... కేసీఆర్ అమలు చేస్తున్న ప్రధానమైన సంక్షేమ పథకాలకు రూ.30 వేల కోట్లు దాటడం లేదు. మరి అప్పులు చేస్తున్న లక్షల కోట్లు ఏం చేస్తున్నారో తెల్వని పరిస్థితి ఏర్పడింది. కేంద్రం సంక్షేమ పథకాలను చెప్పడం..టీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టడం, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నాం. బీఆర్ఎస్ ను తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ మీటింగ్‌ల ద్వారా ఇంటింటికీ బీజేపీని చేరువ చేయండని బండి సంజయ్ కార్యకర్తలకు పిలిపునిచ్చారు.

# ఆదానీ ఆస్తులు పెరగడంలో ప్రధాని పాత్ర

(మొదటి పేజీ తరువాయి) సమయంలో వివిధ రాష్ట్రాల ప్రజలు ఈ ప్రశ్నలు వేసినట్లు ఆయన తెలిపారు. తమిళనాడు, కేరళ నుంచి హిమాచల్ ప్రదేశ్ వరకు అంతటా ఒక్కటే పేరు వినిపిస్తోందని, అంతటా అదానీ పేరే వినిపిస్తోందని రాహుల్ అన్నారు. అదానీ ఏ వ్యాపారంలో అడుగుపెట్టినా అతను ఫెయిల్ కారని ప్రజలు అంటున్నట్లు రాహుల్ గుర్తు చేశారు. కశ్మీర్‌లోని యాపిల్ల నుంచి.. పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రోడ్డుల గురించి కూడా అదానీ పేరు వినిపిస్తోందని అన్నారు. ప్రధాని మోడీ, అదానీకి మధ్య ఉన్న సంబంధ మేంటని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. దేశమంతా అదానీ సక్సెస్ వెనుక ఎవరున్నారన్నది తెలుసుకోవాలనుకుంటోందని అన్నారు. రాష్ట్రపతి స్పీచ్ పై ధన్యవాద తీర్మానం సందర్భంగా లోక్ సభలో రాహుల్ అదానీ అంశాన్ని లేవనెత్తారు. మోడీ, అదానీ కలిసి ఉన్న ఫొటోను రాహుల్ ప్రదర్శించగా బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో స్పీకర్ రాహుల్ ను వారించారు. అనంతరం మాట్లాడిన రాహుల్ గాంధీ 2014లో 8బిలియన్ డాలర్లుగా ఉన్న అదానీ సంపద 2022 నాటికి 140 మిలియన్ డాలర్లకు ఎలా పెరిగిందని యువత తెలుసుకోవాలనుకుంటున్నారని అన్నారు. కశ్మీర్ యాపిల్స్ నుంచి పోర్టులు, ఎయిర్ పోర్టులు, రోడ్ల వరకు అన్ని ప్రాజెక్టులను చేపట్టే సత్తా కేవలం అదానీకి మాత్రమే ఉందని రాహుల్ సటైర్ వేశారు. ప్రధాని, అదానీ మధ్య బంధం ఈ నాటిదికాదన్న రాహుల్... మోడీ గుజరాత్ సీఎంగా ఉన్న నాటి వారు ఒకరికొకరు సాయం చేసుకుంటున్నారని అన్నారు. 2014లో మోడీ ఢిల్లీ పీఠం ఎక్కడం వెనుక అదానీ ఉన్నారని ఆరోపించారు. ఎయిర్ పోర్టులకు సంబంధించి ఎలాంటి అనుభవం లేని కంపెనీలకు వాటి డెవలప్ మెంట్ పనులు అప్పగించొద్దన్న రూల్ ను అదానీ కోసం కేంద్రం మార్చేసిందని రాహుల్ ఆరోపించారు. ప్రస్తుతం అదానీ చేతిలో ఆరు ఎయిర్ పోర్టులు ఉన్నాయని, చివరకు అత్యంత లాభదాయ కమైన ముంబై ఎయిర్ పోర్టును సైతం సీబీఐ, ఈడీలను ఉపయోగించి జీవీకే నుంచి లాక్కొని అదానీకి అప్పజెప్పారని విమర్శించారు. డ్రోన్ల తయారీలో అనుభవం లేకపోయినా హెచ్ఏఎల్ ను కాదని అదానీకి కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు. అదానీ కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టడం వెనుక కారణాలతో పాటు ఇప్పటి వరకు ఆయనకు ఎన్ని కాంట్రాక్టులు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకపోతే రాష్ట్రపతి ప్రసంగంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం లాంటి అంశాలను ప్రస్తావించలేదన్నారు. అగ్నివీర్ పథకం ఆర్మీ ఆలోచన నుంచి రాలేదని, అది ఎన్ఎస్ఏ చీఫ్ అజిత్ దోవల్ ఆలోచన నుంచి వచ్చిట్లు రాహుల్ విమర్శించారు. అగ్నివీర్ పథకాన్ని బలవంతంగా ఆర్మీపై రుద్దినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు ఆయుధ శిక్షణ ఇచ్చి, వాళ్లను తిరిగి సమాజంలోకి పంపడం వల్ల హింస పెరుగుతుందని రిటైర్డ్ ఆఫీసర్లు ఆరోపిస్తున్నట్లు రాహుల్ గాంధీ ఆరోపించారు. అయితే రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆరోపణలు చేయడం కాదు.. ఆధారాలుంటే చూపించాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు రాహుల్ కు సూచించారు.

# వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



(మొదటి పేజీ తరువాయి) కలిపి పెట్టారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. ప్రభుత్వం వస్తేనే పేదలకు న్యాయం చేసేందుకు సాధ్యమౌతుందని వారిని సూచించారు. కాంగ్రెస్ ను గెలిపించేందుకు మీరంతా పని చేయాలని మహిళా కూలీలతో రేవంత్ రెడ్డి చెప్పారు. కాగా ములుగులో గట్టమ్మ, సాయిబాబా దేవాయాల్లో నిన్న రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు చేసి పాదయాత్రను ప్రారంభించారు. కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. తెలంగాణ ఇచ్చింది, దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. కాంగ్రెస్ భూములు పంచితే బీఆర్ఎస్, బీజేపీ అమ్ముకుంటున్నాయని ఆరోపించారు. హాథ్ సే హాథ్ యాత్రలో భాగంగా ములుగు జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభలో సీతక్క పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సమస్యలు తీరుతాయని చెప్పారు. కేసీఆర్ పాలనలో మంచి నీళ్లు దొరకడం లేదు కానీ... మందు మాత్రం గల్లీ గల్లీలో ఏరులై పారుతోందంటూ కామెంట్ చేశారు. ములుగు జిల్లాకు సమ్మక్కసారలమ్మ జిల్లా అని పేరు పెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. రేవంత్ యాత్రను విజయవంతం చేయాలని సీతక్క కోరారు.

# బిసిల ఆత్మగౌరవాన్ని నిలిపేలా భవనాలు




(మొదటి పేజీ తరువాయి) కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..పిల్లల చదువుల కోసం గురుకులాలు, ఆడబిడ్డల పెండ్లిండ్ల కోసం కల్యాణలక్ష్మి, కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలు తదితర సౌకర్యాల న్నింటిని సీఎం కేసీఆర్ కల్పిస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో భగవంతుడి పేరు మీద రాజకీయాలు నడిపించే వారిని నమ్మవద్దని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 24గంటల కరెంట్ తెలంగాణ ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఇంటింటికి తాగునీరు అందిస్తుందని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో రోడ్లు కనెక్టవిటి ని కల్పించారని తెలిపారు. విద్యాభివృద్ధికి పాఠశాలలు, కళాశాలలు పెద్ద ఎత్తున నిర్మించు కున్నామని అన్నారు. ప్రతి జిల్లాలో వైద్య కళాశాలలు ఏర్పాటు అవుతున్నాయని వెల్లడించారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచిన ముఖ్యమంత్రి కేసీఆర్ దేశాన్ని కూడా మార్చాలనే తపనతో ఉన్నారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణలోని బీసీ కులాలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఆలోచించి జాతీయ స్థాయిలోనూ బీఆర్ఎస్‌కు మద్దతిచ్చేలా జాతీయ కులసంఘాలకు నచ్చజెప్పాలని సూచించారు. రాబోయే రోజుల్లో బీసీ కులాలు కేసీఆర్, బీఆర్ఎస్ పట్ల కృతజ్ఞతాభావంతో ఉండాలని పిలుపునిచ్చారు. నాటి పాలకులు బీసీలను ఓటర్లుగానే ఉపయోగించుకున్నారని ఆరోపించారు. ఏనాడు బీసీల ఆర్థిక స్థితిగతులపై మాట్లాడలేదని దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా బీసీలు 80 కోట్లుండగా వీరి కోసం కేంద్రం కేవలం రెండువేల కోట్లు మాత్రమే కేటాయించిందని ఆరోపించారు. తెలంగాణలో రెండుకోట్లున్న బీసీలకు తెలంగాణ ప్రభుత్వం ఆరువేల కోట్ల రూపాయలను కేటాయించిందని వెల్లడించారు. ప్రత్యేకంగా బీసీ శాఖను ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందన్నారు. కులవృత్తులందరికీ చేయూతను అందిస్తుందని తెలిపారు. బీసీలకు చెందిన పిల్లలు విద్యాపరంగా ఉన్నత చదువులు చదువలానే సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా 325 గురుకులాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఇటీవల ప్రకటించిన రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు లక్షకోట్లు కేటాయించగా అధిక శాతం బీసీ వర్గాలకే దక్కనున్నాయని పేర్కొన్నారు. కుల సంఘాలు ఐక్యమత్యంతో పనులు సాధించుకోవాలని సూచించారు. విభేదాలతో రోడ్డకెక్కడం అవమానకరమని పేర్కొన్నారు. వృత్తి కులాలు నాగరికతను తెలియజేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం , బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, టీఎస్ఎంఐడీసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రేఖాయాదగిరి నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పులు కప్పిపుచ్చుకునేందుకే విమర్శలు

(మొదటి పేజీ తరువాయి) ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌కు సవాల్ విసిరారు. ఐటీఐఆర్ పై కేసీఆర్ ప్రభుత్వం అబద్దాలు చెబుతోందన్నారు. ఐటీఐఆర్ ఇవ్వడం లేదంటూ కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం విమర్శలు చేయడం సరికాదని రఘునందన్ రావు మండిపడ్డారు. ఐటీఐఆర్ ను 2 విడతలుగా చేయాలని నాటి యూపీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని గుర్తు చేశారు. ఐటీఐఆర్ కోసం కేంద్రం విడుదల చేసిన నిధులను ప్రాజెక్టు నిర్మాణం కోసం ఖర్చు చేయలేదన్నారు. ఐటీఐఆర్ ప్రాజెక్టు మొదటి ఫేజ్ కోసం కేంద్ర ప్రభుత్వం 2015లోనే రూ.85 కోట్లు విడుదల చేసిందని గుర్తు చేశారు. ఇమ్లిబన్ బస్టాండ్ నుంచి ఫలక్ నామా వరకూ మెట్రో ఎందుకు రాలేదని ఎమ్మెల్యే రఘునందన్ రావు ప్రశ్నించారు. మెట్రో రాకపోవడానికి బీఆర్ఎస్ తో పాటు ఎంఐఎం కూడా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఎంఐఎంకు పాతబస్తీ అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదన్నారు. ఫలక్ నామా నుంచి శంషాబాద్ వరకూ కొత్త మెట్రోఏర్పాటు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని చెప్పారు. కొత్త రైల్వేలైన్ కోసం డీపీఆర్ పూర్తి చేయకుండా, స్థలం సేకరించకుండానే కేంద్రాన్ని బద్నాం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపడం లేదని స్పష్టం చేశారు. కేవలం కేంద్రానికి ఉత్తరాలు రాస్తే కంపెనీలు రావని, డీపీఆర్ లు ఇస్తే పనులు ముందుకు సాగుతాయని సూచించారు. కేంద్రం, ప్రధాని మోడీపై క్రమపద్ధతిలో బీఆర్ఎస్ దాడి చేస్తోందని ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. ఐటీఐఆర్ పై బీఆర్ఎస్ ప్రభుత్వం శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐటీఐఆర్ విషయంలో కేంద్ర ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి తప్పు లేదని స్పష్టం చేశారు. ఐటీఐఆర్ కు ఇవ్వాల్సిన దాని కంటే ఎక్కువ నిధులను కేంద్రం మంజూరు చేసిందని తెలిపారు. డీపీఆర్ సమర్పించుకుంటే కేంద్రం నిధులు ఎలా కేటాయిస్తోందని ప్రశ్నించారు. తెలంగాణలో హైవేలు, రైల్వేల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# భూకంపధాటికి విలవిలలాడుతున్న టర్కీ



(మొదటి పేజీ తరువాయి) ఘజియాబాద్‌లోని హిండోన్ వైమానిక స్థావరం నుంచి ఈ సహాయక బృందాలు బయల్దేరాయి. ఆపదలో చిక్కుకున్న టర్కీకి భారత దేశం తక్షణం ఆపన్న హస్తం అందజేసింది. సహాయక బృందాలను, సామాగ్రిని పంపిస్తామని ప్రధాన మంత్రి కార్యాలయం ప్రకటించిన కొద్ది గంటల్లోనే అవి భారత వైమానిక దళ విమానంలో బయల్దేరాయి. నిపుణులైన జాతీయ విపత్తు స్పందన దళం బృందాలు, అత్యంత నైపుణ్యంగల జాగిలాల స్క్వాడ్స్, ఔషధాలు, అడ్వాన్స్‌డ్ డ్రిల్లింగ్ ఎక్విప్‌మెంట్, సహాయక చర్యలకు అవసరమయ్యే ముఖ్యమైన పరికరాలు వీటిలో ఉన్నాయి. ఎన్‌డీఆర్ఎఫ్ బృందంలో మహిళలు కూడా ఉన్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి మంగళవారం ఇచ్చిన ట్వీట్‌లో, భారత దేశ మానవతావాద సహాయ, విపత్తు ఉపశమన శక్తి, సామర్థ్యాలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయని తెలిపారు. భూకంప బాధితులకు అందజేసే సహాయంలో మొదటి విడత సహాయక మెటీరియల్ తుర్కియేకు బయల్దేరినట్లు తెలిపారు. ఎన్‌డీఆర్ఎఫ్ సెర్చ్, రెస్క్యూ టీమ్స్, స్పెషల్లీ ట్రైన్డ్ డాగ్ స్క్వాడ్స్, మెడికల్ సప్లయ్స్, డ్రిల్లింగ్ మెషిన్స్, ఇతర అవసరమైన పరికరాలు వీటిలో ఉన్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన ఓ ట్వీట్‌లో, టర్కీలో భూకంపం వల్ల మరణించినవారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. గాయపడినవారు సత్వరం కోలుకోవాలని ఆకాంక్షించారు. వేలాది మంది ఇబ్బందులను ఎదుర్కొంటున్న సమయంలో, వారికి అన్ని విధాలుగా సహాయపడాలని అధికారులను ఆదేశించారు.

## ఎంట్రెన్స్ టెస్టుల షెడ్యూల్ విడుదల

### మే 7 నుంచి 11 వరకు ఎంసెట్

### ఇంజనీరింగ్ ప్రవే పరీక్ష

**హైదరాబాద్,ఫిబ్రవరి 7 (సమ సమాజం):** రాష్ట్రంలోని వృత్తి విద్యాకోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి షెడ్యూల్ విడుదలైంది. ఎంసెట్, ఈసెట్, లాసెట్, పీజీసెట్, ఐసెట్, ఎడ్‌సెట్, పీజీఈ సెట్‌కు సంబంధించిన కామన్ ఎంట్రన్స్ టెస్టులకు సంబంధించిన పరీక్షా తేదీలను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు అధికారులు ప్రకటించారు.

## వైభవంగా పెద్దగట్టు ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి) శివాలయంలోనైనా శివరాత్రి రోజు శివకల్యాణం నిర్వహించడం సంప్రదాయం. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి భక్తులు పెద్దత్తున తరలివస్తారు.

# 10,11న ఫార్ములా రేస్

## హైదరాబాద్‌లో ట్రాఫిక్ జామ్



హైదరాబాద్,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌లో ఈ నెల 10, 11న ఫార్ములా ఈ రేస్ జరుగనుంది. ఈ రేస్ కు అధికారులు ఏర్పాట్లు చేస్తుండగా.. పోలీసులు ఇప్పటికే ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పబ్లిక్ ను అలర్ట్ చెయ్యకుండా.. ఇలా ట్రాఫిక్ ఆంక్షలు పెట్టడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ నెల 10,11 న జరగనున్న రేస్ కు ఇప్పుడు నుండి ట్రాఫిక్ ఆంక్షల విధించడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసుల చర్యలతో లక్డీకాపూల్, ఖైరతాబాద్, ఐ మాక్స్ పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామైంది. ఈ రేస్ కోసం నె÷-లకెస్ రోడ్డులో 2.7 కి.మీ మేర ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. తెలుగు తల్లి చౌరస్తా నుంచి ఎన్టీఆర్ గా÷-డ్గ÷న్‌లోకి వెళ్లే విధంగా ట్రాక్‌ను రూపొందిస్తున్నారు. ఎన్టీఆర్ గా÷-డ్గ÷న్‌లో నుంచి వెనక వైపు ఉన్న మింట్ కాంపౌండ్ మర్రి చెట్టు, ఐమాక్స్ థియేటర్, ఇందిరాగాంధీ విగ్రహం మీదుగా మొత్తం 17 మలుపులు వచ్చేలా ఈ ట్రాక్ వెళ్తుంది.

# తొలి టెస్టుకు పకడ్బందీగా సిద్ధం

## టీమిండియా వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్



**ముంబై,ఫిబ్రవరి 7 (సమ సమాజం):** బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా తొలి టెస్టుకు పకడ్బందీగా సిద్ధమవుతు న్నట్లు టీమిండియా వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ తెలిపాడు. ఈ సిరీస్ తమకు చాలా ముఖ్యమని వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో ÷నైల్ చేరడమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నట్లు చెప్పాడు. ఇందులో భాగంగా ముగ్గురు స్పిన్నర్లతో ఆడాలని అనుకుంటున్నట్లు వెల్లడించాడు. అయితే మ్యాచ్ తొలి రోజు పిచ్‌పై అంచనాకు వచ్చిన తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నాడు. ఆస్ట్రేలియా టీమ్‌లో చాలా మంది లెఫ్ట్ హ్యాండర్లు ఉన్నారని..ఇది భారత బౌలర్లకు సవాల్ అని చెప్పాడు. అయితే సిరాజ్, అశ్విన్‌లకు లెఫ్ట్ హ్యాండర్లపై మంచి రికార్డు ఉందన్నాడు. అయితే స్పిన్నర్ల బౌలింగ్‌లో లెఎ÷-టాండర్లు ఇబ్బంది పడతారని.. అందుకే ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే యోచనలో ఉన్నామని చెప్పుకొచ్చాడు. టెస్టు సిరీస్?లో తన ఓపెనింగ్ స్థానాన్ని త్యాగం చేసేందుకు సిద్ధమని కేఎల్ రాహుల్ తెలిపాడు. జట్టు అవసరం కోసం మిడిలార్డర్‌లోనైనా బ్యాటింగ్ చేస్తానన్నాడు. ఇంకా తొలి టెస్టు ఆడే తుది జట్టును నిర్ణయించ లేదన్నాడు. అయితే టీమ్‌లో కొన్ని ఖాళీలను భర్తీ చేయాలన్నాడు. ఈ టెస్టు సిరీస్‌లో తాను ఓపెనింగే చేస్తానని అనుకోవడం లేదన్నాడు. టీమ్ ఆదేశిస్తే..తాను మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేసేందుకైనా రెడీ అన్నాడు.

# ఆసియాకప్ నిర్వహణపై సందిగ్ధత

## బిసిసిఐ ఆదేశాలను పాటిస్తామన్న రవిచంద్రన్ అశ్విన్



**ముంబై,ఫిబ్రవరి 7 (సమ సమాజం):** పాకిస్థాన్‌లో ఆసియాకప్ నిర్వహణపై సందిగ్ధత కొనసాగుతోంది. పాక్‌లో ఆసియాకప్ నిర్వహిస్తే టీమిండియా ఆడదని ఇప్పటికే బీసీసీఐ ప్రకటించింది. టీమిండియా పాక్‌లో జరిగే ఆసియాకప్‌లో పాల్గొనకపోతే ..భారత్‌లో జరిగే వరల్డ్ కప్‌లో పాక్ ఆడదంటూ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్‌లో జరగాల్సిన ఆసియా కప్ – 2023ను ఎక్కడ నిర్వహించాలనే దానిపై ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) సభ్య దేశాలతో చర్చిస్తోంది. ఈ నేపథ్యంలో ఆసియాకప్ ఎక్కడ నిర్వహించాలన్న దానిపై భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. పాకిస్థాన్‌లో నిర్వహిస్తే భారత్ ఆడదని ఇప్పటికే బీసీసీఐ ప్రకటించిన నేపథ్యంలో తాము బీసీసీఐ ఆదేశాలను పాటిస్తామని అశ్విన్ తెలిపాడు. అయితే ఒక వేళ భారత్ ఆడాలి అనుకుంటే ఆసియాకప్ వేదికను తప్పక మార్చాల్సిందేనని చెప్పాడు. గతంలోనూ ఆసియాకప్ వేదికలు మార్చిన సంఘటలున్నాయన్నాడు. భారత్ పాక్‌లో జరిగే ఆసియాకప్?లో పాల్గొనకుంటే..పాకిస్థాన్ భారత్‌లో జరిగే వరల్డ్ కప్‌లో పాల్గొనకుండా ఉంటుందని తాను అనుకోవడం లేదన్నాడు. సియాకప్ వేదికను నిర్ణయించడంలో తుది నిర్ణయం ఏసీసీదే అని అశ్విన్ అన్నాడు. అయితే ఆసియాకప్?ను యూఏఈలో నిర్వహించాలని అనుకుంటే..యూఏఈకి బదులు శ్రీలంకతో నిర్వహిస్తే బాగుటుందని చెప్పాడు. భారత్?లో జరిగే వన్డే వరల్డ్ కప్ కూ కూడా ఇది దోహదపడుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

# మిడిఆర్డర్ భారమంతా ఇక కోహ్లీపైనే

## గవాస్కర్ రికార్డుపై కన్నేసిన రన్ మెషిన్



**నాగ్‌పూర్,ఫిబ్రవరి 7 (సమ సమాజం):** మూడేళ్లపాటు ఫామ్ కోల్పోయి పరుగుల కోసం తంటాలు పడిన టీమిండియా మాజీ స్కిప్పర్ విరాట్ కోహ్లీకి ఆసియాకప్ కలిసొచ్చింది. ఆ టోర్నీతో కోహ్లీ గడ్డుకాలం పోయింది. ఆఫ్ఘనిస్థాన్‌పై సాధించిన సెంచరీ కోహ్లీలో ఆత్మవిశ్వాసం పెంచింది. ఆ తర్వాతి నుంచి రన్ మెషీన్ మళ్లీ పరుగుల వేట ప్రారంభించాడు. సెంచరీలు బాదుతూ మళ్లీ లైమ్‌లైట్‌లోకి వచ్చాడు. తాజాగా ఇప్పుడు కోహ్లీ మరోమూడు రికార్డులపై కన్నేశాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఈ నెల 9న భారత్-ఆస్ట్రేలియా మధ్య జరగనున్న తొలి టెస్టుతో సిరీస్ ప్రారంభమవుతుంది. శ్రేయాస్ అయ్యర్, రిషభ్ పంత్ఈ సిరీస్‌కు దూరం కావడంతో మిడిలార్డర్ భారమంతా కోహ్లీ మోయాల్సిందే. దీనిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆ మూడు రికార్డులను కొల్లగొట్టాలని కోహ్లీ కృతనిశ్చయంతో ఉన్నాడు. కోహ్లీ ఈ ఏడాదిని బాగానే ఆరంభించాడు. ఆరు వన్డేల్లో 67.6 సగటుతో 338 పరుగులు సాధించి ఊపుమీదున్నాడు. ఆస్ట్రేలియాతో జరగనున్న టెస్టు సిరీస్‌లో మరోమారు పరుగుల వరద పారించాలని భావిస్తున్న కోహ్లీని మూడు రికార్డులు ఊరిస్తున్నాయి. కోహ్లీని ఊరిస్తున్న మూడు రికార్డుల్లో మొదటిది ఇది. విరాట్ కనుక మరో 64 పరుగులు సాధిస్తే ఈ రికార్డు అతడి సొంతమవుతుంది. టెస్టుల్లో 8,119, వన్డేల్లో 12,809, టీ20ల్లో 4008 పరుగులు కలుపుకుని కోహ్లీ ఖాతాలో మొత్తంగా 24,936 పరుగులున్నాయి. 546 ఇన్నింగ్స్‌లలోనే కోహ్లీ ఈ ఘనత సాధించాడు. వీటికి మరో 64 పరుగులు కనుక జోడిస్తే 25 వేల పరుగులు సాధించిన రెండో ఇండియన్‌గా, ఓవరాల్‌గా ఆరో క్రికెటర్‌గా రికార్డులకెక్కుతాడు. అంతేకాదు, దీంతో పాటు మరో అరుదైన ఘనత కూడా అందుకుంటాడు. అత్యంత వేగంగా ఆ మైలురాయిని చేరుకున్న ఆటగాడి గానూ చరిత్ర సృష్టిస్తాడు. ఈ జాబితాలో సచిన్ ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్నాడు. టెండూల్కర్ 576 ఇన్నింగ్స్‌లలో ఆ ఘనత అందుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరగనున్న తొలి మ్యాచ్‌లోనే కోహ్లీ ఈ రికార్డును బద్దలుగొట్టే అవకాశం ఉంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో కోహ్లీ కన్నేసిన మరో రికార్డు ఇది. ఈ గో÷-డలెన్ చాన్స్‌ను కూడా కోహ్లీ అందిపుచ్చుకునే అవకాశం ఉంది. టెస్టుల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్లలో కోహ్లీ 8,119 పరుగులతో ఆరో స్థానంలో ఉన్నాడు. ఈ నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో కోహ్లీ కనీసం మరో 391 పరుగులు జోడిస్తే.. 8,503 పరుగులతో ఈ జాబితాలో ఐదో స్థానంలో ఉన్న వీరేంద్ర సెహ్వాగ్‌ను వెనక్కి నెట్టేసి ఆ స్థానానికి చేరుకుంటాడు. 2018లో పెర్త్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో కోహ్లీ 123 పరుగులు చేశాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో మరో రెండు సెంచరీలు కనుక సాధిస్తే సునీల్ గవాస్కర్ రికార్డును అధిగమిస్తాడు. ఆస్ట్రేలియాపై అత్యధిక సెంచరీలు సాధించిన రెండో భారత క్రికెటర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. ఆసీస్‌పై కోహ్లీ 20 మ్యాచుల్లో 7 టెస్టు సెంచరీలు సాధించగా, గవాస్కర్ అన్నే మ్యాచుల్లో 8 సెంచరీలు సాధించాడు.




### శరవేగంగా టైగర్ నాగేశ్వర రావు షూటింగ్

రవితేజ చేతిలో ప్రస్తుతం మూడు సినిమాలున్నాయి. అందులో టైగర్ నాగేశ్వరరావు ఒకటి. ఈ చిత్రం ఇండియన్ రాబిడ్ హుడ్‌గా పిలవబడే గజదొంగ టైగర్ నాగేశ్వరరావు జీవిత కథ అధారంగా తెరకెక్కనుంది. 70,80 దశకాల్లో నాగేశ్వరరావు ఆంధ్ర ప్రదేశ్‌లో భారీ ఎత్తున దొంగతనాలు, దోపిడీలు చేస్తూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే వాడు. ఇలాంటి గజదొంగ కథ బయోపిక్‌గా తెరకెక్కనుంది అనడంతో ప్రేక్షకులలో ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మేజర్ అప్‌డేట్‌ను చిత్రబృందం ప్రకటించింది. టైగర్ నాగేశ్వరరావు షూటింగ్ భారీ స్థాయిలో జరగుతుంది త్వరలోనే ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేస్తా అంటూ నిర్మాత అభిషేక్ ఓ స్పెషల్ వీడియోను రిలీజ్ చేశాడు. పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'కిట్టు ఉన్నాడు జాగ్రత్త' ఫేం వంశీకృష్ణ దర్శకత్వం వహిస్తున్నాడు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్‌పై అభిషేక్ అగర్వాల్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. జీవి ప్రకాష్ సంగీతం అందిస్తున్నాడు.మాస్ మహరాజా బోలెడన్ని ఆశలతో 'ధమాకా'తో ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. రిలీజ్ రోజున మిక్స్ టాక్ తెచ్చుకుంది. కానీ ఓపెనింగ్స్ అదిరిపోయాయి. టాక్‌తో సంబంధంలేకుండా రోజు రోజుకు కలెక్షన్లు పెరుగుతూ వచ్చాయి. ఫస్ట్ వీక్‌లో బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం రెండు వారాల్లోనే వంద కోట్ల గ్రాస్‌ను కలెక్ట్ చేసి అందరిని ఆశ్చర్యపరిచింది. రవితేజ ఎనర్జిటిక్ పర్‌ఫార్మెన్స్, శ్రీలీల డ్యాన్సులు ప్రేక్షకులను ఫుల్ ఎంటర్‌టైన్ చేశాయి. రవితేజ కెరీర్‌లో తొలి వంద కోట్ల గ్రాస్ సినిమా ఇదే అవడం గమనార్హం.ఇదే అనుకుంటే తర్వాత వచ్చిన వాల్తేరు వీరయ్య కూడా తిరుగులేని విజయాన్ని సాధించింది. ఈ సినిమా సక్సెస్‌లో సగం క్రెడిట్ రవితేజకే దక్కుందన్న మాట వాస్తవం. చిరు పాత్రకు వంకపెట్టలేం కానీ, సోలోగా వచ్చుంటే మాత్రం ఈ రేంజ్‌లో హిట్టయ్యేది కాదు. ఈ విషయాన్ని స్వయంగా చిరునే ఓ సందర్భంలో చెప్పాడు. ఇలా వరుస బ్యాక్ టు బ్యాక్ హిట్లు రవితేజకు మంచి ఉత్సాహాన్నిచ్చాయి. ప్రస్తుతం అదే స్పీడ్‌తో సెట్స్‌పై ఉన్న సినిమాలను పూర్తి చేస్తున్నాడు.










## కాంతారా సీక్వెల్‌కు ప్రయత్నాలు

కొన్ని సినిమాలను మాటల్లో వర్ణించడానికి పదాలు చాలవు. డిక్షనరి కొనుక్కొని కొత్త కొత్త పదాలను వెతుక్కోవాల్సి ఉంటుంది. అలా మాటల్లో చెప్పలేని సినిమాల్లో 'కాంతార' ఒకటి. తెలిసిన కథే కావచ్చు.. కానీ ఆ కథనే ఎంత కొత్తగా చెప్పాము అనేది దర్శకుడి ప్రతిభకు నిదర్శనం. ఈ విషయంలో వందకు వంద మార్కులు కొట్టేశాడు దర్శకుడు రిషబ్ శెట్టి. ఈ సినిమాలో రిషబ్‌శెట్టి దర్శకుడిగా ఒక మెట్టు ఎక్కితే.. నటుడిగా పది మెట్లు ఒకేసారి ఎక్కాడు. గతేడాది బిగ్గెస్ట్ హిట్లలో 'కాంతార' ఒకటి. చిన్న సినిమాగా విడుదలై బాక్సాఫీస్ దగ్గర సంచలనాలు సృష్టించింది. గతేడాది సెప్టెంబర్‌లో భారీ అంచనాల నడుమ కన్నడలో రిలీజైన ఈ సినిమా మొదటి రోజు నుండి పాజిటీవ్ టాక్ తెచ్చుకుని భారీ వసూళ్లు సాధించింది.

ఈ సినిమాకు వస్తున్న ఆధరణతో అన్ని భాషల ప్రేక్షకుల నుండి భారీ డిమాండ్ ఏర్పడింది. దాంతో మేకర్స్ పలు భాషల్లోకి డబ్ చేసి రిలీజ్ చేశారు. తెలుగుతో పాటు హిందీ, తమిళ్, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేశారు. ఇక రిలీజైన ప్రతి భాషలో భారీ వసూళ్ళను సాధిస్తూ డబుల్ బ్లాక్‌బస్టర్ నిలిచింది. తాజాగా ఈ సినిమాకు ప్రీక్వెల్ ఉండనున్నట్లు చిత్రబృందం ఇటీవలే ప్రకటించింది. తాజాగా దీనిపై హీరో కమ్ డైరెక్టర్ రిషబ్‌శెట్టి స్పందించాడు. ఇప్పటివరకు మీరు చూసిన కాంతార పార్ట్-2 అని, మొదటి పార్ట్ వచ్చే సంవత్సరం వస్తుందని చెప్పాడు. దీంతో ప్రీక్వెల్‌పై ఎక్కడలేని అంచనాలు క్రియేట్ అయ్యాయి.

ఇన్నేళ్ల సినీ చరిత్రలో ఒక పార్ట్-2, తర్వాత పార్ట్-1 రావడం బహుశా ఇదే మొదటిసారేమో. ప్రీక్వెల్‌లో రిషబ్ తండ్రి జీవితం, ఆయన చనిపోయి ఎటెళ్లారు అనే అంశాలను చూపించబోతున్నట్లు టాక్. ఇందులో భాగంగానే రిషబ్ ఇటీవలే కర్ణాటకలోని కోస్టల్ ప్రాంతానికి వెళ్లాడట. వీలైనంత త్వరగా ఈ సినిమాను సెట్స్ మీదకు తీసుకెళ్లి, వచ్చే ఏడాది సమ్మర్‌లో రిలీజ్ చేయాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తు?న్నారట. ఇక కాంతారకు వచ్చిన క్రేజ్‌తో ప్రీక్వెల్‌ను మరింత గ్రాండ్ స్కేల్‌లో రూపొందించాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

## మరోమారు శాకుంతలం వాయిదా

టాలీవుడ్ బ్యూటీ సమంత నటిస్తున్న తాజా చిత్రం 'శాకుంతలం'. ఇందులో శకుంతలగా సమంత.. దుష్యంతుడిగా దేవ్ మోహన్ నటించారు. ఈ మూవీ ఫిబ్రవరి 17న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని ఇప్పటికే మేకర్స్ తెలిపారు. అయితే ఈ సినిమా ఇప్పుడు మరోసారి వాయిదా పడింది. ఈ చిత్రం 17న థియేటర్లకు రావడం లేదనీ, త్వరలోనే కొత్త రిలీజ్ డేట్ ను ఎనౌన్స్ చేస్తామని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. గుణశేఖర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in